పందెం

విశ్వనాథ గణపతిరాజు

"ఒరేయ్! రంధి. ఈయాళ మనమంతా బేగెల్లాలిరా, బడికి!... మాష్టేరుగారు సెప్పారు" అన్నాడు చెరువు గట్టు దగ్గర కూర్చుని పందుల్ని కాస్తున్న రంధిగాడితో రామిగాడు.

"ఏం?" అని అడిగాడు రంధిగాడు.

"మనకి సొతంత్ర మొచ్చిందట!... అందుకని ఆటలు ఆడిత్తారట మాష్టేరుగారు. పందేలు పెట్టి బగుమతులు కూడా ఇత్తారట!..."

"నిన్ననేమిరా బడికి రానేదు?..." మరో కుర్రోడు అడిగాడు రంధిగాడ్ని.

"మా అయ్యకి ఊష్ణ మొచ్చినాదిరా. అందుకని నేను పందుల్ని కాయాల్సొచ్చింది."

"అయితే ఈయాలా రావేటి?.."

"వత్తాను. మా అయ్య కాసేపట్లో వత్తాడు. అప్పుడెలిపోస్తాను." అన్నాడు.

"సరే!.. బేగిరా! మేమంతా బడికాడే ఉంతాం!.." అంటూ తనతో వచ్చిన కుర్రోళ్ళతో వెళ్ళిపోయాడు రామిగాడు. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మూపురాలతో చెరువు ఒడ్డున బురదలో పొడుస్తూ తిరుగుతున్న పందుల్ని లెక్క పెట్టుకున్నాడు రంధిగాడు. అటూ ఇటూ వెళ్ళిపోకుండా లెక్కకు సరిగ్గా ఉన్నాయనుకుని, తండ్రి రాగానే విషయం చెప్పి లగెత్తుకవెళ్ళాడు బడి వైపుకి! ..

బడంటే భారీ బిల్డింగులో లేదది. కనీసం కమ్మలపాకలో కూడా లేదు. ప్రకృతి సహజంగా పుట్టి, కొమ్మలు బార చాచుకుని, మెడకు "బడి" అన్న చిన్న బోర్డు తగిలించుకుని ఉన్న, మర్రి చెట్టు క్రింద ఉంది.

ఆ చెట్టు క్రింద ఒకటి నుండి మూడో క్లాసు వరకూ జరుగుతుంటే, ప్రక్కనే ఉన్న వేప చెట్టు క్రింద నాలుగో క్లాసు, సీమ చింత చెట్టు క్రింద ఐదో క్లాసు నడిపేస్తున్నారు.

(గమనిక :– ఈ మధ్యే మంత్రిగారు నాటి వెళ్ళిన మొక్కలను ఊరి జనం పెంచుతున్నారు గనుక అవి త్వరలో చెట్లుగా మారితే వాటి క్రింద మరికొన్ని క్లాసులు పెట్టవచ్చు!...)

అది ఆ బడి పరిస్థితి.

* * * *

పిల్లలకు పరుగు పందెం పెట్టారు శంకరం మాష్టారు.

వరుసగా పరిగెడుతున్న వాళ్ళలో రంధిగాడి పరుగు చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచారాయన.

పిల్లలందర్నీ ఆరు బేచీ లుగా విడదీసి పెట్టిన పరుగు పందెంలో ఆరుగురు ఫస్టుగా వస్తే, ఆ ఆరుగురికీ పందెం పెడితే రంధిగాడు ఫస్టువాడిగా వచ్చాడు.

వాడి భుజం తట్టి మెచ్చుకున్నారు శంకరం మాష్టారు.

వేప చెట్టు క్రింద నిలుచుని చూస్తున్న సాంబాబు వడివడిగా అడుగు లేస్తూ వచ్చి, పౌరుషంగా తల ఎగుర వేసి, "ఏమిటి మాష్టారు. నన్నెందుకు వీళ్ళతో పందెం వెయ్యించలేదు?..." అని నిలదీసి అడిగాడు

ఉలిక్కిపడి వాడి వైపు చూసిన శంకరం మాష్టారు, "అమ్మమ్మ! ఆ మాటనకు బాబూ! నిన్ను కూడా వీళ్ళతో పరుగు పెట్టిస్తే... ఆ విషయం మీ మావయ్య గారికి తెలిస్తే నన్ను ఈ ఊరు నుండే పరుగు పెట్టిస్తారు.."

"ఎందుకూ?..." అర్థంకాక అడిగాడు.

"ఎందుకంటావేమిటి బాబూ!... నీవు పరిగెడితే నీ కాళ్ళు నొప్పి పుడతాయి. ఆ విషయం మీ మావయ్య గారికి చెపుతావు. అప్పుడు నా పని సరి!... చూడు బాబూ! నీకు కావలసింది బహుమతేగా? నీకా బహుమతి వచ్చే ఏర్పాటు నేను చేస్తానుగా! నువ్విక ఇంటి కెళ్ళిపో బాబూ!..." అంటూ సాంబాబు చిన్ని గెడ్డం పుచ్చుకుని బ్రతిమలాడారు మాష్టారుగారు.

ఆయన చేతిని దూరంగా నెట్టేస్తూ, "అలా ఇచ్చిన బహుమతి నా కొద్దు! నేను పరుగులో వాళ్ళతో గెలవగలిగితేనే తీసుకుంటాను" అన్నాడు.

"ఇంతటి నిజాయితీ నీలో ఉండకూడదు నాయనా!" అని అనబోయి, ఆ మాటను బలవంతంగా గొంతులో దిగమింగుకున్నారు మాష్టారు గారు.

"ఏమిటి మాష్టారు?.. మాట్లాడరు!" మరలా అడిగాడు, సాంబాబు!

మాష్టారుగారి మౌనమే సమాధానమయింది ఈ సారి కూడా!

'సరే!..' అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు సాంబాబు! శంకరం మాష్టారుగారి గుండె దడదడా కొట్టుకోసాగింది, ఏ ముపద్రవం వస్తుందోనని!...

అనుకున్నట్టే, పది నిముషాల్లో వెంట బెట్టు కొచ్చాడు సాంబాబు, వాళ్ళ మావయ్య బంగార్రాజుని. ఆయన వస్తూనే, "ఏమిటి మాష్టారు? మా వాడు చెపుతుంది..." అని అడిగారు.

అంతా వివరించి చెప్పారు శంకరం మాష్టారు.

"ఏమిరా! మాష్టారుగారు చెప్పింది బాగానే ఉందిగా! నీ కంతగా కావలిస్తే బహుమతి ఇప్పిస్తానంటున్నారు కదా?..." అన్నారు మేనల్లుడితో.

"నా కొద్దు!..." తల విసురుగా విసిరాడు సాంబాబు!

"సరే!... మాష్టారూ! వీడు మొండి వెదవ. మన మాట వినడు గాని, ఓ సారి వాళ్ళతో పరిగెత్తించు!..."

అది విని సాంబాబు ముఖం వెలిగిపోతే, మాష్టారు గారి ముఖం వివర్ణమయింది. ఆయన మరికాస్త ఇరుకులో పడ్డారు.

"అయ్యా! ఇప్పుడు ఫైనల్‌గా మిగిలింది రంధిగాడు. వాడితోనే మనవాడ్ని పందెం వెయ్యించాలి!..."

"వెయ్యించు!.." వేయిస్తేనేం అన్నట్టు అడిగారు బంగార్రాజు.

మాష్టారుగారు ఇబ్బందిగా ముఖం పెట్టి, "వెయ్యొచ్చనుకోండి! కాని వాడిది లేడి పరుగు. మన సాంబాబు ఓడిపోయే ప్రమాదముంది!..."

ఆ మాటలు విని బంగార్రాజు ఒంటి కాలు మీద లేచాడు.

"అదంతా నా కనవసరం. నువ్వేం చేస్తావో నీ ఇష్టం. మా వాడే గెలవాలి.." అంటూ కోపంగా అక్కడి నుండి వెళ్ళిపోయారు ప్రెసిడెంటు!

తల పట్టుకుని కాలు విరిగిన కుర్చీలో కూర్చుండి పోయారు, మాష్టారు గారు. ఓ రెండు నిముషాలు ఆలోచించి పందెం మరుసటి రోజుకి వాయిదా వేసి, సాంబాబుని బ్రతిమలాడి పంపించేసారు.

* * * *

మరుసటి రోజు ప్రెసిడెంటుగారు, ఊరి జనం చూస్తుండగా పందెం ప్రారంభమయింది.

రంధిగాడు, సాంబాబూ ప్రక్క ప్రక్కనే నించున్నారు, పరుగు పెట్టడానికి సిద్ధంగా!....

రంధిగాడ్ని చూడగానే కాస్త అనుమానమొచ్చింది ప్రెసిడెంటు గారికి వెంటనే మాష్టారు గారిని పిలిచి అడిగారు.

"వాడా?... వాడు దాసరయ్య కొడుకండి!..." అన్నాడు.

అంతే!... ప్రెసిడెంటుగారు షాక్ తిన్నట్టయ్యారు. గతంలో వాడి వెనుక నున్న కథ ఆయన కళ్ళ ముందు కదలాడింది.

* * * *

"శారదా! పిలుస్తున్నది నిన్నే!...!" ఈ సారి గర్జించాడు బంగార్రాజు.

అయినా శారద వినిపించుకోలేదు. కూర్చున్న కుర్చీలోంచి లేచి బయటకు వెళ్ళిపోబోయింది.

గభుక్కున ఆమె చెయ్యి పట్టుకుని ఆపాడు బంగార్రాజు.

పట్టుకున్న చేతిని విసురుగా విదిలించి,

గిరుక్కున అటు తిరిగి కోపంగా చూసింది అతని వైపు శారద.

"పిలుస్తుంటే వినిపించుకోకుండా వెళ్ళిపోతున్నావేం?..."

"నీ పిలుపు విని ఆగాల్సిన అవుసరం నాకేంలేదు" నిర్లక్ష్యంగా చెప్పింది ఆమె!

"ఉంది .."

"లేదు!.."

"నేను నీకు కాబోయే భర్తను ..." మీసాలు మెలేస్తూ అన్నాడు.

ఆ మాటలకు మరింత కోపంగా చూసింది శారద, అతని వైపు.

"ఎవరన్నారు?.." సూటిగా అడిగింది.

"మన పెద్దలు..."

"పెద్దల మాటలతో పెళ్ళిళ్ళు జరిగిపోవు! .."

"నీ వెందుకిలా మాట్లాడుతున్నావో నాకు తెలుసు!..."

"నీకు తెలిసిందేమిటో నాకూ తెలుసు! .."

"ఏమిటి నీకు తెలిసింది?..."

"నేను దాసరితో తిరుగుతున్నానని నీ కెవరో చెప్పారు. చెప్పినా అది అబద్ధం మాత్రం కాదు. నేను అతన్ని ప్రేమిస్తున్నాను. అందుకే అతని వెంట తిరుగుతున్నాను..."

"కులభ్రష్టురాలి వవుతావు..."

"దాని వల్ల ప్రాణం పోదు. ప్రేమ నశించదు..."

"ప్రేమ కోసం ప్రాణం పోగొట్టుకోవల్సి వస్తే!..."

"అలా ఎన్నటికీ జరుగదు. ఒకవేళ జరిగినా నేను భయపడను. నాకు కావలసింది ఆ దాసరి ప్రేమే!..."

"అది మాత్రం నీకు దక్కదు... నీకు పెళ్ళంటూ జరిగితే నాతో నే!..."

"అది నీ భ్రమ మాత్రమే!.... బావవైనంత మాత్రాన పెళ్ళి చేసుకోవాలని ఎక్కడా లేదు."

"ఉంది. చచ్చినట్టు నువ్వు నన్నే పెళ్ళి చేసుకుంటావు. ఆ స్థితికి నిన్ను నేన తీసుకొస్తాను."

"అయితే పందెం కట్టగలవా?..." ఛాలెంజ్ చేస్తూ కుడి చేతిని విసురుగా గాలిలోకి ఎత్తి అడిగింది శారద.

"పందెమా?.. ఎలా?.." అర్థం కానట్టు అడిగాడు బంగార్రాజు.

"నీవే గెలిస్తే .... అంటే దాసరి నుండి నన్ను విడదీసి నీవు పెళ్ళి చేసుకోగలిగితే, నాపై పగతో నన్ను నీవు స్వీకరించకపోయినా నీకు ఊడిగం చేస్తూ నీ కాళ్ళ దగ్గరే బానిసలా బ్రతుకుతాను. అదే నేను గాని గెలిస్తే, నీవు జీవితాంతం నా ఎదురు తల ఎత్తుకుని తిరక్కూడదు."

ఆ మాటలు వింటూంటే బంగార్రాజు ఒంటికి నిప్పు పెట్టినట్లు మండిపోసాగాడు. పిడికిలి బిగించి ఎదురుగా ఉన్న రాతి స్తంభాన్ని ఒక్క గుద్దు గుద్దాడు.

"ఏం, ఓడి పోతానేమోనన్న భయమేస్తుందా?..." శారద, హేళనగా అతని వైపు చూస్తూ అంది.

"ఆ భయం నీకుండాలి!... సరే! నీ పందెంకి నేను ఒప్పుకుంటున్నాను." అంటూ విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు బంగార్రాజు.

తరువాత, బంగార్రాజు ఎంత ప్రయత్నించినా శారదను ఆపలేకపోయాడు.

ఓ రోజు రాత్రి సమయంలో శారద, దాసరిని లేపుకుపోయింది. వాళ్ళ గురించి ఎంక్వైరీ చేసి చూసాడు బంగార్రాజు. ఎక్కడో పెళ్ళి చేసుకుని, ప్రక్కనే ఉన్న చేట పర్రులో కాపురం పెట్టారని తెలిసింది.

తను ఓడిపోయినందుకు మండిపోయాడు బంగార్రాజు. ఎలాగైనా ఆమెపై కక్ష కట్టి దెబ్బ తియ్యాలనుకున్నాడు. కాని అనుకోని సంఘటనలు, మార్పులూ జరగడంతో ఏమీ చెయ్యలేకపోయాడు.

బంగార్రాజు తల్లిదండ్రులు యాక్సిడెంటులో చనిపోయారు. తరువాత తండ్రి వారసుడిగా ఊరి ప్రెసిడెంటయ్యాడు. చెల్లెలి బలవంతం మీద దూరపు బంధువుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఇన్ని మార్పులతో తన కక్ష సాధింపు చర్యని, శారద మీద అమలుపరచ లేకపోయాడు. అలా అని పూర్తిగా మర్చిపోనూ లేదు. తన పాషాణ హృదయపు పొరలలో ఓ మూల దాచే ఉంచాడు.

రెండేళ్ళు గడిచి పోయాయి.

శారద, దాసరయ్య ఓ బిడ్డతో తిరిగి ఈ ఊరొచ్చారు. వాళ్ళతో పాటు ప్రెసిడెంటు ఎలక్షన్లు వచ్చాయి. అందుకని వాళ్ళు వచ్చినట్లు తెలిసినా బంగార్రాజు కిమ్మనకుండా ఊరుకున్నాడు. దానికి కారణం లేకపోలేదు. ఏం చేసినా ఫలితం దక్కితే ఫరవాలేదు. ఒకవేళ బెడిసి కొడితే గుట్టు బయట పడుతుంది. అట్టడుగు వర్గాల నుండి వచ్చే అరవై శాతం ఓట్లు పోయే ప్రమాదం ఉంది. అందుకని కొన్నాళ్ళు మౌనం వహించడమే మంచిదని ఉరుకున్నాడు.

ఊళ్ళో ఎక్కడైనా శారద ఎదురైతే, ముఖం చాటు చేసుకుని వెళ్ళిపోవడం మొదలు పెట్టాడు, బంగార్రాజు. దానికి శారద నవ్వుకునేది.

ఎలక్షన్లయ్యి, బంగార్రాజు మరలా ప్రెసిడెంటయ్యాడు. అప్పటి వరకూ మౌనం వహించిన బంగార్రాజు తన కక్ష సాధింపు చర్య మొదలు పెట్టాడు.

పోలమ్మ జాతరలో బిడ్డడ్ని చంక నేసుకుని తిరుగుతున్న శారదను, బంగార్రాజు మనుషులు ఆమె తిరుగుతున్న ఏరియాలో పెద్ద గొడవ పెట్టి... గందరగోళంగా తయారైన ఆ గుంపు మధ్యలో ఇరుక్కుపోయిన శారదను నిర్దాక్షిణ్యంగా కత్తిపోటుకి గురి చేసారు. వెన్నులోంచి దూసుకుపోయిన పదునైన కత్తి శారదను క్రింద పడి, గిలగిలా తన్నుకుని చనిపోయేలా చేసింది!....

అంత దూరంలో చంక నుండి జారి పడిపోయిన ఆమె కొడుకు రంధిగాడు బంగురుకుంటూ వచ్చి శారద గుండె పైకి ఎగబ్రాకి ఏడవసాగాడు.

మరుసటి రోజు పంచాయతీ జరిపే సమయంలో శారద శవాన్ని చూసిన బంగార్రాజుకు రాక్షసానందం కలిగింది. కాని ఆమె ముఖంలో విజయ గర్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుందతనికి!... 'నా ప్రాణాన్ని తీయగలిగావు గాని నా ప్రేమను మాత్రం భంగపరచలేకపోయావు నీవు!' అని!

★ ★ ★ ★

"అయ్యా! పందెం మొదలు పెట్టించ మంటారా?"... అన్న మాష్టారి గారిమాటలతో ఉలిక్కిపడ్డాడు బంగార్రాజు. మరొకసారి రంధిగాడి వైపు చూసాడు. వాడు తన వైపేచూస్తున్నాడు. శారదే వాడి రూపంలో నిలుచుని, ఒకసారి పందెంలో ఓడావు. ఇంకా సిగ్గు రాలేదా నీకు. మరలా ఓడాలని ఉందా?..." అంటున్నట్టనిపించింది.

బంగార్రాజు కుర్చీలోంచి దిగ్గున లేచి నిలుచున్నాడు. మాష్టారు గారిని దగ్గరగా పిలిచి, "మాష్టారూ! ఏది ఏమైనా మా సాంబాబే గెలవాలి! ఆ రంధిగాడు ఎట్టి పరిస్థితిలోనూ గెలవడానికి వీలులేదు" అన్నాడు మెల్లగా!....

"అల్లాగేనండి!... నేనా ఏర్పాటు చేసానులెండి." అన్నాడు, అంతే మెల్లగా!.... అని లైను దగ్గరికి వెళ్ళి మాష్టారుగారు విజిల్ కొట్టారు.

రంధిగాడు, సాంబాబు పరుగు లంకించుకున్నారు. చూస్తున్న పిల్లలు కేకలు పెట్టసాగారు. పెద్దలు ఉత్సుకతతో చూస్తున్నారు.

పరిగెడుతున్న ఇద్దరిలో సాంబాబు ముందుకు వెళ్ళాడు. తరువాత రంధిగాడు, వాడ్ని దాటేసాడు.

రంధిగాడు!....

సాంబాబు!.....

రంధిగాడు.

రంధిగాడు

రంధిగాడు.

రంధిగాడిది ఒకటే పరుగు! లేడి పరుగు.

. శంకరం మాష్టారు గారికి గుండె దడదడా కొట్టుకోసాగింది. 'ఒకవేళ రాత్రి ఇచ్చిన మాట గాని మర్చిపోలేదు కదా వీడు?' అన్న అనుమానం కలిగిందాయనకు.

ముందు రోజు పందెం వాయిదా వేసినపుడు రాత్రి పది గంటల సమయంలో మెల్లగా రంధిగాడి ఇంటికి కెళ్ళారు మాష్టారుగారు. వెళ్ళి వాడి చేతులు పట్టుకుని, "ఒరేయ్ రంధి. ఇవి చేతులు కావురా!... నన్ను మరో ఊరు ట్రాన్సుఫరై పోయేలా చెయ్యకురా!... రేపు పందెంలో నువ్వు ఓడిపోరా!..." అంటూ రంధిగాడి చేతులు పట్టుకున్నారు మాష్టారుగారు.

"ఏమిటి మాష్టారు?... నన్ను బాగా పరిగెడతావురా





ధర్మపథం భగవదర్శన

భగవత్సేవలో, భగవదర్చన ప్రధానమైనదిగా భక్తులు భావిస్తారు. అష్టోత్తర నామ పూజకంటే సహస్రనామ పూజ ముఖ్యమనీ, అంతకంటే లక్షార్చనకు విలువ ఎక్కువ అనీ వారి భావన. పుష్పాలలో కొన్ని అందంగా ఉంటాయి. కాని వాటికి సువాసన ఉండదు. కొన్ని అందంగా కానరాక పోయినా మంచి పరిమళం కలిగి ఉంటాయి. కొన్ని అందంగానూ, సువాసన కలవిగానూ కూడా ఉంటాయి. అందువల్ల ఈ మూడో రకం పువ్వులను సంపాదించి, వాటినే భగవ దర్చనకు ఉపయోగించ డానికి ప్రయత్నించడం జరుగుతుంది. ఎక్కువ ఖర్చు చేస్తే గాని అవి లభించవు. విలువగల పూలతో పూజిస్తే భగవంతునికి అనుగ్రహం కలుగుతుందనే అభిప్రాయంతో ఇలా అర్చన జరుగుతుంది. భక్తి ప్రధానం కాని పూవులు దేవునికి ముఖ్యం కావు. రాజుగారు పూజించిన సువర్ణ పుష్పాల కంటే భక్తితో కుమ్మరి చేసి తెచ్చిన మట్టి పూవులే భగవంతుడు ప్రీతితో స్వీకరించిన గాథ అందరూ ఎరిగినదే!

ఇతర పుష్పాలకంటె ఎక్కువ విలువైనది హృదయ కుసుమమే! అచంచల భక్తితో హృదయంలో భగవంతుణ్ణి ధ్యానించడమే ఉత్తమమైన భగవదర్చన. ఆ అర్చనకు ఏ సహస్ర నామార్చనా, ఏ లక్షార్చనా సాటిరావు. అట్టి భక్తుణ్ణి భగవంతుడు, అన్ని వేళలా గమనిస్తూ, ఆపదలు వచ్చినపుడు అడ్డుపడి రక్షిస్తాడు. భక్తునికి అట్టి విశ్వాసం కూడా ఉంటుంది.

ఒకప్పుడు ఎడతెగని వర్షాలవల్ల ఒక గ్రామానికి దగ్గరగా ఉన్న ఒక యేటికి వరద వచ్చింది. ఆ యేటికి అంత వరద రావడం గ్రామస్థులలో ఎవ్వరూ కనీ వినీ ఎరుగరు. వాన వెలియగానే నదీ ప్రవాహాన్ని వేడుకగా చూడడానికి కొందరు అక్కడికి వెళ్లారు. వారిలో పరమ భక్తాగ్రణి ఒకడు ఉన్నాడు. అందరూ నది ఒడ్డున నిలిచి, ప్రవాహాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నారు. ఆ భక్తుడు కొంత ముందుకు వచ్చి నీటి వడి ఎంత ఉందో అని నీటిలో కాలు పెట్టాడు. వెంటనే ప్రవాహం అతన్ని లోపలికి లాగుకొని పోతున్నది. అతనికి ఈత తెలియదు. ప్రవాహం నుంచి తప్పించుకొని ఒడ్డు చేరడానికి అతను ఎంతో యత్నిస్తున్నాడు. కాని లాభం లేకపోయింది. ఒడ్డున ఉన్నవారు "ఇతడిని నీటిలో ఎవరు దిగమన్నారు? ఈదడం చేతకానివాడలా చెయ్యవచ్చునా?" అని విమర్శిస్తున్నారే కాని, ఒక్కరూ అతనికి సహాయం చెయ్యడానికి సిద్ధపడలేదు. ఆ భక్తుడికి దైవ ధ్యానం తప్ప గత్యంతరం లేకపోయింది. ఇంతలో ఎక్కడి నుంచో ఒక జాలరి వచ్చి ప్రవాహంలో దిగి, ఆభక్తుని చెయ్యి పట్టుకుని లాగుతూ, అతి కష్టం మీద ఒడ్డు చేరి అతని ప్రాణాలను రక్షించాడు. సమయానికి భగవంతుడు తన భక్తుణ్ణి రక్షించ డానికి ఆ జాలరిని పంపాడని మనం గ్రహించాలి. ఆడంబరంగా ప్రచారం కోసం చేసే భగవదర్చన కంటే నిరాడంబరంగా హృదయ కుసుమంతో పూజించడమే ఉత్తమం. అదే భక్తునికి శ్రీరామ రక్ష.

—బులుసు వేంకటరమణయ్య

అన్న మీరే ఓడి పొమ్మంటున్నారు?" అని అడిగాడు వాడు, మాష్టారుగారు చెపుతున్నదేమిటో అర్థంకాక!

"నా పరిస్థితి అటువంటిదిరా!..." అంటూ అంతా వివరించి ఒప్పించారు మాష్టారుగారు.

మరి ఇప్పుడు సాంబాబుని వదిలేసి రంధిగాడు అలా పారిపోతుంటే అనుమానం కలిగింది, మాష్టారు గారికి!

ఉంతే!...

ఒక్క క్షణంలో మార్పు జరిగిపోయింది.

మెరుపులా పరుగు తీసిన రంధిగాడు దబ్బున క్రింద పడిపోయాడు. మరి లేవలేనట్టు నటించసాగాడు. అది చూసిన మాష్టారు గారి గుండెలో ఒక్క సారిగా దడ తగ్గిపోయింది.

బంగార్రాజు మీసాలు మెలేస్తూ లేచి నిలుచున్నాడు.

అంతే!...

మరో హటాత్ సంఘటన!,..

ఎవరూ ఊహించని సంఘటన... చివరికి రంధిగాడు కూడా అలా జరుగుతుందనుకో లేదు.

రంధిగాడి కన్నా ఓ రెండు గజాలకు ఇవతలే సాంబాబు పడిపోయాడు. మాష్టారుగారు పరుగున వాడి దగ్గరికి వెళ్ళారు. వాడిక పరుగెత్త లేనన్నాడు. అది విని బంగార్రాజు తల బాదుకున్నాడు.

శారద నవ్వుతుంది.

బంగార్రాజు చేతి కర్రను నేలకేసి కొట్టి చరచరా వెళ్ళిపోయాడు, ఈ ఓటమిని భరించలేనన్నట్టు!...

రంధిగాడు మెల్లగా సాంబాబు దగ్గరికి వచ్చాడు. సాంబాబు వాడి భుజం మీద చెయ్యి వేసి, "ఒరేయ్! నువ్వే గెలిచావురా!... నీతో పరిగెత్తడం ఎవడి తరం కాదు. నీవు పడిపోవడం చూస్తేనే నాకు అర్థమయిపోయింది. నువ్వు నిజంగా పడిపోలేదని, నిన్ను కావాలని ఎవరో పడిపొమ్మన్నారని. అందుకే న్యాయంగా నీకు రావలసిన బహుమతిని నేను తీసుకోవడం మంచిది కాదని, నీలాగే పడిపోయినట్లు నటించాను... ఇంకెప్పుడూ నీ పరుగును వెనుకపడనివ్వకు! పరిగెడుతూనే ఉండు.

నీ పరుగును అడ్డే వాళ్ళను నెట్టుకుని పరిగెత్తు!.. పందెంలో గెలుపునీ చేతికి దక్కించుకోడానికే చూడు!..."

విజ్ఞాని లా మాట్లాడుతున్న సాంబాబు మాటలు మౌనంగా రంధిగాడు వింటుంటే, మాష్టారుగారు నోరు తెరిచి ఆశ్చర్యంగా వినసాగారు.

శారద ఆనందాశ్రువులు రాలుస్తుంది. □